www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 జనవరి 2024
5
వైఎస్ఆర్



పిల్లల కేసులపై చర్యలు తీసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

తప్పిపోయిన, గుర్తించబడని పిల్లల కేసులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పోలీసు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైకోర్టు వారి ఆదేశాల మేరకు స్టేట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ అండ్ క్యాలెండర్ ఆఫ్ యాక్టివిటీస్‌లో భాగంగా మంగళవారం మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్ ఉన్న కేసు వివరాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు



అంగన్వాడీల జైల్ భరో

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 29వ రోజుకు చేరుకుంది. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. జైల్ బరో మానవహారం, మోకాళ్లపై నిల్చుని రాస్తారోకో వంటి వినూత్న పద్ధతుల్లో నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

మానవహారం, మోకాళ్లపై కూర్చుని నిరసన
29వ రోజూ కొనసాగిన సమ్మె

పోరుమామిళ్ల : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో యథావిధిగా 29వ రోజున సమ్మె నిర్వహించారు. సమ్మెలో భాగంగా పోలీస్‌స్టేషన్ చేరుకుని తమను అరెస్టు చేయండి అంటూ కొద్ది సేపు ఆందోళన చేశారు. 'జైల్లో నైనా పెట్టండి.. లేదా జీతాలు పెంచండి' అంటూ నినాదాలు చేశారు. పోలీసులు ఆందోళన కారుల పేర్లు నమోదు చేసుకున్నారు. తరువాత పోలీస్ స్టేషన్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.భైరవప్రసాద్, సిఐటియు మండల నాయకులు బొజ్జ చిన్నయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం. విజయమ్మ కెవిపిఎస్ నాయకులు రత్నం, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు జనిరెడ్డి వినోదా దేవి, మేరీ మండలనాయకులు దస్తగిరమ్మ, జ్యోతమ్మ, విజయమ్మ, లక్ష్మీదేవి, అంజనమ్మ, స్వాతి, వాణి, ఫాతిమా, శ్రీదేవి, రమాదేవి, సుమారు 200 మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని 29 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. మంగళవారం రాజీవ్ మార్గ్ నుంచి మహవీర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం చేపట్టారు. వీరికి మద్దతుగా ఆటో యూనియన్ నాయకులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు మనోహర్, నాగసుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ అంగన్‌వాడీలు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాత్రమే కోరుతున్నారని తెలిపారు. కనీస వేతనం రూ.26వేలు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు, ఎఐటియుసి నగర కార్యదర్శి మద్దిలేటి, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, అర్బన్ ప్రాజెక్టు అంజనీదేవి, పద్మావతి, సావిత్రి, దీప, ఐఫ్టు యూనియన్ నాయకులు పవన్‌కుమార్, దస్తగిరి, ఎఐఎల్ నాయకులు రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీలకు నోటీసులు ఇచ్చి సమ్మెను ఆపాలని ప్రయత్నం చేస్తుందని, తాము నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని జమ్మలమడుగు ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీ యూనియన్ నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి పేర్కొన్నారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వ ర్యంలో 29 రోజుకు చేరడంతో మోకా ళ్లపై నిల్చుకొని వినూత్న రీతిలో అంగ న్వాడీలు నిరసన చేపట్టారు. కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ బాధ్యులు వినయ్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, జ్యోతి, నరసమ్మ, కులాయమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు. **చాపాడు :** అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం 29 ఆకారంలో కూర్చొని తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తల మండల నాయకురాలు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. 29 రోజులుగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేస్తున్న ప్రభుత్వ విధానంలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. అంగన్వాడీ కార్యకర్తలను బెదిరించే ధోరణిలో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు **బద్వేలు :** ఎపి అంగన్వాడీ వర్కర్స్ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నిర్వ హిస్తున్న రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె 29వ రోజులో భాగంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సమగ్ర శిశు అభివృద్ధిని అధికారి కార్యాలయం నుంచి 4 రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, మానవ హక్కుల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్, ఉపాధ్యక్షులు ఆదిల్, జీ.వి రమణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం గోపవరం మండల నాయకులు పి.కదిరయ్య ,ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు యం.గౌతమి, పట్టణ అధ్యక్షురాలు జి. అనంతమ్మ, పట్టణ నాయకురాళ్లు మోక్షమ్మ, బాలమ్మ,మస్తాన్ బీ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు పులి శాంప్రవీణ్, పట్టణ నాయకులు రాజగోపాల్, హరి, శివకుమార్, శ్రీనివాసులు, వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు గంప సుబ్బరాయుడు, ప్రజానాట్యమండలి కళాకారులు నరసయ్య పెద్ద సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు,మినీ అంగన్వాడీ వర్కర్లు, పాల్గొన్నారు. **మైదుకూరు :** అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం మైదుకూరులో 3 వరోజు నిరవధిక దీక్షలు చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ధనలక్ష్మి, భారతి, చెన్నమ్మ, రామతులసి, రిజ్వన, జి.లక్ష్మి, రమాదేవి, పుష్ప, అనురాధ, శ్రీదేవి, రాని, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



కడప నగరంలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు

మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, హాజరైన సభ్యులు





బిల్లు..ఘొల్లు!

ఆర్అండ్‌బి ఎస్ఇపై అసహనం
నాడు-నేడు బిల్లుల చెల్లింపులపై నిలదీత
రూ.70 కోట్ల హౌసింగ్ బిల్లులపై ఆందోళన
జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో నెలకొన్న నిర్లక్ష్యంపై ఆందోళన వ్యక్తమైంది. మంగళవారం జిల్లా పరిషత్ సభాభవన్‌లో జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఎంపిపి, జడ్‌పిటిసిలు, వివిధ శాఖలకు చెందిన పలువురు హాజరయ్యారు. పంచాయతీరాజ్ శాఖ మొదలుకుని జిజిఎంపి, నాడు-నేడు, హౌసింగ్, ఆర్అండ్‌బి శాఖల్లో పేరుకు పోయిన బకాయిలను తక్షణమే చెల్లించాలని వినతులు వెల్లువెత్తాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏపార్టీ అధికారంలోకి వస్తుందో, ఏమో తెలియనే ధోరణి ప్రతిధ్వనించింది. గడప గడపకూ కార్యక్రమం కింద సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున చేపట్టిన 200 పనులకు రూ.100 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందని ఏకరువు పెట్టారు. నాడు-నేడు పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులకు నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదని నిలదీశారు. జిల్లాలోని జగనన్న ఇళ్ల నిర్మాణ పనులకు రూ.70 కోట్ల చెల్లింపుల్లో నిర్లక్ష్యమేమిటని ప్రశ్నించారు. రైల్వేకోడూరు ఆర్టీసీ బస్టాండు ఆక్రమణలకు గురవుతోందని, కాంపౌండ్ నిర్మాణాన్ని చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనిజడ్‌పి కోఆప్షన్ సభ్యులు వలి విజ్ఞప్తి చేశారు. తిరుపతి నుంచి రాజంపేటకు రాత్రిపూట రావడానికి బస్సుల సమస్య తీవ్రంగా ఎదురవుతోందని, రాత్రి తొమ్మిది గంటలకు తిరుపతిలో బస్సు సౌకర్యం ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బద్వేల్ నుంచి కడప, రాజంపేట వైపు రాత్రిపూట వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రాత్రిపూట తొమ్మిది గంటలకు కడప, బద్వేల్ డిపోల్లో బస్సులు ఏర్పాటు చేస్తే 10 గంటలలోపు లంకమల అభయారణ్యం నిబంధనలకు, కడప, తిరుపతి, చిత్తూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లే ప్రజల రాకపోకలకు అనుగుణంగా ఉంటుందని రామాపురం జడ్‌పిటిసి రమణ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బి.కోడూరు జడ్‌పిటిసి రమణయ్య మాట్లాడుతూ బద్వేల్ నుంచి ములకలపల్లి రోడ్డు అధ్వానంగా మారిందని, మరమ్మతులు చేపట్టాలని నాలుగు సమావేశాల నుంచి కోరుతున్నప్పటికీ స్పందన కనిపించడం లేదని వాపోయారు. పోరుమామిళ్ల జడ్‌పిటిసి ముత్యాలు మాట్లాడుతూ గానుగపెంట, లక్కలపల్లి, టేకూరుపేట, కాలువగండ్ల ప్రాంతాల రహదారులు అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చక్రాయపేట ప్రాంతం నుంచి 12 వేల లీటర్లు పాలసేకరణ జరుగుతోందని, అటువంటి ప్రాంతానికి పశువైద్యాధికారిని నియమించాలని పదే పదే కోరుతున్నప్పటికీ స్పందన లేకుండా పోయిందని జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి వాపోయారు. జిల్లా పశువైద్యాధికారి శారద సర్దుబాటు చేసే ప్రయత్నంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చక్రాయపేట పశువైద్యాధికారి లేకపోవడంతో తాను కూడా ఆరు ఆవులను విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని, మిగిలిన పాడి రైతులు నాటు వైద్యుల సహాయంతో వైద్యం చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి అవసరమైన గిడ్డంగుల సమస్య ఎదురవుతోందని జడ్‌పి కోఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గిడ్డంగులు తక్కువ పరిమాణంలో ఉన్నాయని తెలిపారు. ప్రయివేటు గోడౌన్లలో నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇటీవల తుఫాన్ బారిన పడిన వరి పంట 1920 హెక్టార్లలో నష్టపోయినట్లు పేర్కొని, తాజాగా 709 హెక్టార్లకు కుదించడం ఆందోళన కలిగిస్తోందని విమర్శించారు. ఏదేమైనా స్టాండింగ్ కమిటీ సమావేశం సారాంశం బిల్లుల చెల్లింపుల చుట్టూ తిరగడం గమనార్హం.

'ఆదిమానవులను చేయొద్దు జగనన్నా..'

ఆకులు, అలుములు కట్టుకుని.., చేతులకు సంకెళ్లతో మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

- 15వ రోజుకు చేరుకున్న సమ్మె

ప్రజాశక్తి- కడప అర్బన్

సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పాల్గొని వినూత్న రీతిలో 'మేము కూడా మీకు ఓటు వేసిన ప్రజలమే.. ఆది మానవులను చెయ్యద్దు' అంటూ అర్ధనగ్నంగా తలకు, వంటికి ఆకులుచుట్టు కుని తమ నిరసన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ కార్యక్రమంలో ప్రభుత్వ పెద్దల తీరు విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం లేదా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినట్లు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ అందరినీ పర్మినెంట్ చేయాలని అడుగుతుంటే అమలు అవుతున్న హెల్త్ అలవెన్స్ జీతంలో కలిపి ఏదో కార్మికుల మేలు చేసే విధంగా మీడియాలో ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తిరుపాల్ , సుంకర రవి, కిరణ్, శ్రీధర్ బాబు,శ్రీరామ్, శివ, కొండయ్య, రమేష్, నాగరాజు, అదాం, వెంకటేష్, నరసింహ, అసిబాబు, బాలాజీ, శీను, జయసింహ, దస్తగిరిమ్మ,ధరణి, కొండమ్మ, లక్ష్మీ, పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు. **బద్వేలు :** మున్సిపల్ కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె 15వ రోజులో భాగంగా మంగళవారం బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం వద్ద సంకెళ్లతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు జీవి రమణారెడ్డి, సిఐటియు పట్టణ యూనియన్ పట్టణ అధ్యక్షుడు శాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షులు దేవమ్మ, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, కోశాధికారి శివకుమార్, కార్యదర్శులు సత్యరాజు,పాలయ్య, ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రామయ్య, కిరణ్, పెంచల వరప్రసాద్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** మున్సిపల్ కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె 15వ రోజులో భాగంగా పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మస్టర్ పాయింట్ వద్ద చేతులకు సంకెళ్లతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, జమ్మలమడుగు పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఏసుదాసు, దాసరి.విజయ్ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ బాధ్యుడు ఎ.వినయ్ కుమార్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుంటే కొంత మంది అదికారులు బెదిరింపులకు దిగడం తగదని మున్సిపల్ కార్మి సంఘ (సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్మికులు కార్మికులు చేతులకు బేడీలు వేసుకుని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సాల్మన్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



కడపలో ఆకులు కట్టుకుని ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

తరగతులను అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ ఆదేశాలను లెక్కచేయకుండా సంక్రాంతి సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తుండటంతో మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలలకు వెళ్లి తరగతులను అడ్డుకుని విద్యార్థులను బయటకి పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు ఈనెల 9 నుంచి 18 వరకు 10 రోజులపాటు సంక్రాంతి సెలవులకు ప్రకటించి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసు కుంటాం అని హెచ్చరించిన జిల్లా లోని కార్పోరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు మాత్రం అవేమీ పట్టించుకోకుండా యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తుండటం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బుక్కే సురేష్ నాయక్ , పొగ విహారి, యశ్వంత్ రెడ్డి, భారత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మొదటి ఇన్నింగ్స్ ఆంధ్ర జట్టు ఆధిక్యం

కడప : కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న సికె నాయుడు ట్రోఫీలో ఆంధ్ర జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌ను 4 వికెట్ల నష్టానికి 606 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది. మూడవ రోజు మంగళవారం బ్యాటింగ్‌కు దిగిన గోవా జట్టు ఆంధ్ర బౌలర్ల దాటికి తట్టుకోలేకపోయింది. తన మొదటి ఇన్నింగ్స్‌లో 79.2 ఓవర్లలో 226 పరుగులకే ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ఆజాన్ తోట 218 బంతులను ఎదుర్కొని 11 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 116 పరుగులు (సెంచరీ) చేశాడు. ఆంధ్ర జట్టులోని టి. విజయ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించాడు. 27 ఓవర్లలో 6 ఓవర్స్ మేడిన్ వేసి 63 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ వాసు 3 వికెట్లు తీసుకున్నాడు. ఆంధ్ర జట్టు గోవా జట్టుకు ఫాలో ఆన్ ఇచ్చింది. దీంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా జట్టు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 19.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 61 పరుగులు చేసింది.



6 వికెట్లు తీసుకున్న ఆంధ్ర బౌలర్ టి. విజయ్

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

చంద్రబాబు 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావడం ఖాయమని టిడిపి కడప నియోజకవర్గం మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని బాలికల జూనియర్ కళాశాల ఎదుట ఉన్న దుకాణాల నుంచి ప్రారంభించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ టిడిపి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తూ ఉన్నారని చెప్పారు. అన్ని వర్గాల వారికి న్యాయం చేసేలా టిడిపి మేనిఫెస్టో ఉందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, జయరామిరెడ్డి, ఓబుల్ రెడ్డి, వేణుగోపాల్, కందుకూరి రమేష్ మామిళ్ళ శివ, వెంకటేష్ యాదవ్, నాసర్ అలీ, మామిళ్ళ శివ, స్వర్ణకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

పర్యాటక పితామహులు సీతారామయ్య ఇకలేరు

కడప అర్బన్ : పర్యాటక పితామహులు, దక్షిణ భారత పర్యాటక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సిద్ధవటం సీతారామయ్య మంగళవారం తెల్లవారు జామున కన్నుమూశారు. గొంతు ఇన్ఫెక్షన్‌తో బెంగళూరులోని ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పర్యాటకానికి పర్యాయపదంగా నిలిచిన సీతారామయ్య కడప గడపలో పర్యాటక ప్రచారాన్ని పరవళ్లు తొక్కించారు. ఆయన మృతి పర్యాటక అభిమానులకు ప్రత్యేకించి 'దక్షిణ భారత పర్యాటక సంస్థ'కు తీరని లోటు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

వల్లూరు : ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. వల్లూరు మండలంలోని ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శంకర్రావు , ఎంపిడిఒ జయశ్రీ, వైసిపి మండల కన్వీనర్ వీరారెడ్డి, ఇఒపిఆర్‌డి ప్రసాద్, వైసిపి నాయకులు నారాయణరెడ్డి , క్రీడాకారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని ఇందిరానగర్, ఆర్ఎన్‌వై కాలనీ పరిధిలో అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వాని స్తున్నామని మండల అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరా నగర్-1కు సంబంధించి (బిసిఎ మహిళ), ఆర్ఎన్‌వై కాలనీకి సంబంధించి మినీ వర్కర్ (ఎస్‌టి మహిళ) అంగన్వాడీ ఆయాల విభాగంలో ఇందిరానగర్-1కు సంబంధించి (బిసి), లింగారెడ్డి పల్లె (ఒసి) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అంగన్వాడీ పోస్టులకు పది, ఆయా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 11న సాయంత్రం ఐదు గంటలలోపు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కార్యాలయం కడపలో అందజేయాలన్నారు.

బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కడప : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. విజయవాడలో ఇటీవల నూతన రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవం విజయవాడ గాంధీ నగర్ లోని ఎస్ఎన్ఆర్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ గా ఇంటూరి యశోదానంద కుమార్(కడప), రాష్ట్ర అధ్యక్షులుగా నూనె నగేష్ (కడప), ప్రధాన కార్య దర్శిగా షేక్ యూనుస్ బాషా (కడప) ఎన్నికయ్యారు.

ప్రాంగణ ఎంపికలలో కెఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ చివరి సంవత్సరం ఉత్తీర్ణులైన సివిల్, మెకానికల్, ఇఇఇ చదువుతున్న విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్ఎస్ మూర్తి తెలిపారు. కళాశాలలో ప్రముఖ బహుళ జాతీయ సంస్థ అయిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (హైదరాబాద్) కంపెనీ వారు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ ప్రాంగణ ఎంపికలలో వివిధ బ్రాంచ్‌ల నుంచి సివిల్-43, ఇఇఇ -03, మెకానికల్-20, మంది మొత్తం 66 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన అయిన వారికి శిక్షణ కాలవ్యవధిలో ఏడాదికి రూ. 2.3 లక్షల వేతనంతో పాటు ఉచిత రవాణా, భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్, కందుల రాజేశ్వరమ్మ, వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్ అభినందించారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

కడప ప్రతినిధి : జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినీస్టీరియల్ ఉద్యోగులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో కలిసిన పంచాయతీరాజ్ మినీస్టీరియల్ సంఘం అధ్యక్ష, కార్యద ర్శులతో కలిసి 2024 నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సిఇఒ ఎం.వి రమణారెడ్డి, జిల్లా పరిషత్ వైఎస్ చైర్మన్ బాలయ్య, సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు మల్లేశ్వరరెడ్డి, చంద్ర, సురేష్, ఇతర జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫాసిస్టు విధానాలకు నిదర్శనం

కడప : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' హైలెవల్ కమిటీ బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు నిదర్శనమని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ధ్వజమెత్తారు. కడపలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు . సదరు హై లెవెల్ కమిటీ జనవరి 15వ తేదీలోగా వన్ నేషన్ వన్ ఎలక్షన్ విధానం అమలు పై ప్రజల అభిప్రాయాలు తెలపాలని కోరడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. దుర్మార్గ పాలన నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాబట్టి భారతదేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలందరూ మూకుమ్మడిగా ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ 46, 47 డివిజన్ ఇన్‌ఛార్జులు పఠాన్ ఫైరోజ్‌ఖాన్, పఠాన్ షరీఫ్ ఖాన్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పింఛను పంపిణీ

వల్లూరు : పెరిగిన వైఎస్ఆర్ పెన్షన్ కానుకను ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పెన్షన్ దారులకు మంగళవారం పంపిణీ చేశారు. వల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పెన్షన్ కానుకను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రూ.3 వేలు పెంచారన్నారు. సంక్షేమ ఫలాలే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు.



కలసపాడు సెయింట్ ఆంటోనీస్, కడప వికాస్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న సంక్రాంతి ముందస్తు సంబరాలు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

బకాయిలు అడిగితే నిర్బంధాలా? : యుటిఎఫ్

కడప అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.18 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని, ప్రజాస్వామిక పద్ధతిలో పోరాటం చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని ప్రయోగించి, అరెస్ట్ చేయడాన్ని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా విమర్శించారు. కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్థిక బకాయిలు చెల్లించాలని ఈనెల 9,10 తేదీల్లో 36 గంటల దీక్ష చేస్తున్నామని ఎప్పుడో 15 రోజుల కిందట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రులకు మెమోరాండం ఇచ్చినా చర్చలకు పిలిచి పరిష్కరించకుండా మంగళవారం ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నాకు అనుమతి ఇవ్వకుండా ఇలా ఉద్యోగ, ఉపాధ్యాయులను నిర్బంధించడం పట్ల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఎవరికి లేని 144 సెక్షన్, 30 యాక్ట్ ఉపాధ్యాయులకే వర్తిస్తుందా? ఎప్పుడో చెల్లించాల్సిన బకాయిలు ఇంకెప్పుడు చెల్లిస్తారు! అంటూ ప్రశ్నించారు. ఉపాధ్యాయుల పై నిర్బంధాలు ప్రయోగించడం మాని, ప్రజా స్వామ్య పద్ధతులలో చర్చలు జరిపి వెంటనే ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలని తెలియజేశారు. లేకుంటే భవిష్యత్తులో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్సులు సి.వి. రమణ, ఏజాజ్, అహ్మద్, రాష్ట్ర కౌన్సిలర్ రూత్ ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు దేవదత్తం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కడప : నగరంలోని 26వ డివిజన్ సున్నపురాళ్లమిట్ట, గాజులవీధి, మాసాపేటలలో తాగునీటి సమస్య ఉందని, అధికారులు వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ నగర మహిళా అధ్యక్షులు కొమ్మాలపాటి లావణ్య పేర్కొన్నారు. మంగళవారం ఆమె పైప్రాంతాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో వీధి కుళాయిలు అధికారులు తొలగించారని, వేలకు వేలు చెల్లించి కుళాయి కనెక్షన్లు తీసుకోలేక తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. పరిష్కారం కొరకు కమిషనర్ ను కలిసి పరిష్కరి స్తామనా ఆమె స్థానికులకు హామీ ఇచ్చారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి

- జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.రంగ జనార్ధన్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్-2047లో భాగంగా జెఎన్‌టియు పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెఎన్‌టియు అనంతపురం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి రంగ జనార్ధన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్-2047లో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి మాట్లాడారు. ర్యాలీలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సూర్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ కె.శేష మహేశ్వరమ్మ, వివిధ డిపార్ట్‌మెంట్ల విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా వాలీబాల్ టీంకు ఎంపికైన కార్తీక్‌రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సౌత్ ఇండియా వాలీబాల్ టీంకు తమ విద్యార్థి ఎంపికైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తాతాజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 4 నుండి 6వ తేదీ వరకు అనంతపూరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ టోర్నమెంట్‌లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారన్నారు. రెండవ సంవత్సరం చదువుతున్న కార్తీక్ రెడ్డి సౌత్ ఇండియా వాలీబాల్ టీంకు ఎంపిక య్యారన్నారు. ఫైనల్ ఇయర్ చదువుతున్న మణికంఠరెడ్డి స్టేట్ సెకండ్ ప్లేస్ ఇన్ ట్రిబుల్ జంప్ సాధించారన్నారు. మరో ఇద్దరు విద్యార్థులు మార్చి నెలలో బెంగళూరులో జరిగే ఇండియన్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక య్యారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఎంపిక పట్ల రాష్ట్ర సాంకేతిక విద్యా కమిషనర్ నాగమణి, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ రమణబాబు ప్రత్యేకంగా అభినందించారన్నారు. కళాశాల హెచ్‌ఒడి శివశంకర్, త్రినాధ్, ఫిజికల్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.




విద్యార్థిని అభినందిస్తున్న సెక్రటరీ రమణబాబు

కుళాయిల్లో కలుషిత నీరు

ప్రజాశక్తి - దువ్వూరు

మండల కేంద్రమైన స్థానిక అమ్మవారి శాల వీధిలో కొద్దిరోజుల నుండి తాగునీటి కుళాయిల నుంచి మురికినీరు వస్తోందని స్థానికులు వాపో తున్నారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ నీటిని కనీసం ఇంటి పరిసరాల శుభ్రత కోసం కూడా వాడలేని విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని తమకు మంచినీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



35 మంది అభ్యర్థుల ఎంపిక

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో మంగళవారం పులివెందులలోని ఆదిత్య బిర్లా కంపెనీలో ట్రైనీ స్వింగ్ మిషన్ ఆపరేటర్ (మహిళలు) ఉద్యోగాలకు వెలుగు ఎపిఎం ఇబ్రహీం ఆధ్వర్యంలో సంస్థ రిక్రూట్ మెంట్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 68 మంది మహిళా అభ్యర్థులు హాజరు కాగా, 35 మంది ఉద్యోగానికి ఎంపికైనట్లు జాబ్ రిసోర్స్ పర్సన్ వెంకటసుబ్బమ్మ తెలిపారు.

డిఎస్‌సి విడుదల చేయమంటే అరెస్టు చేస్తారా?

- డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నంద్యాల తులసీశ్వర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

డిఎస్‌సి విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరితే అరెస్టు చేయడం ఏంటని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నంద్యాల తులసీశ్వర్ ప్రశ్నించారు. మంగళవారం తులసీశ్వర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఛలో విజయవాడ పిలుపునిస్తే దాన్ని భగ్నం చేయడానికి ముందస్తు నోటీసులు ఇస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అదిగో డిఎస్‌సి ఇదిగో అంటూ నిరుద్యోగులను వంచించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మెగా డిఎస్‌పిపై ప్రకటన చేయని పక్షంలో ఛలో సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి డివైఎస్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తుందని ఆయన హెచ్చరించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన వెంకటేశ్వర్లు (55) అనే అనాథ మృతదేహానికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ లక్ష్మణ్‌మోరే మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు భిక్షాటన చేస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ప్రభుత్వాపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మోరే తెలిపారు. అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పోలీస్, ఆసుపత్రి సిబ్బంది తమ సంస్థకు సమాచారం అందజేశారన్నారు. స్పందించి హిందూ శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించామన్నారు.

క్రైం కార్నర్

36 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో అక్రమంగా తరలిస్తున్న 36 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారి రెడ్డప్ప అన్నారు. సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. రెండు సుమోల్లో తరలిస్తున్న 36 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకొని బియ్యాన్ని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం విలువ రూ.1,90,500 ఉంటుందని విజిలెన్స్ అధికారి రెడ్డప్ప చెప్పారు. సత్యసాయి జిల్లా కదిరికి చెందిన రవి, షేక్ అక్రమ్ బాషాపై వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను రెవెన్యూ అధికారులకు అప్పగించామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.



బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కాలనీలకు వెళ్లే దారి బాగు చేయరూ..!

ప్రజాశక్తి - కమలాపురం

కమలాపురం మండలం ఎర్రగుడిపాడు గ్రామంలోని ఎస్‌సి, బిసి కాలనీవాసులు సరైన రోడ్డు సౌకర్యంలేక ఇబ్బందులుపడుతున్నారు. రోడ్డు చాలా అధ్వానంగా ఉందని, ఆ దారిన వెళ్లలేకున్నామని వాపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దారికిరువైపులా కంపచెట్లు అల్లుకుపోయాయని, చీకటి పడితే ఆ దారి నుంచి రాకపోకలు సాగించాలంటే ప్రజలు హడలి పోతున్నారని తెలిపారు. చాలా ఏళ్ల క్రితం ఇక్కడ సిసి రోడ్డు వేశారు. ఇది పాతదికావడంతో దెబ్బతింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వాపోతున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆయా కాలనీలలో పర్యటించినప్పుడు స్థానిక సమస్యలను పరిశీలించారు. తక్షణమే సిమెంట్ రోడ్లు, సరైన దారి కల్పిస్తామని ప్రజల సమక్షంలో మాటిచ్చారు. అంతేగా కుండా అక్కడే ఉన్న నాయకులకు కూడా వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. రెండేళ్లు కావస్తున్నా ఆ హామీ నెరవేరలేదు. దారికి అడ్డంగా ఉన్న కంపచెట్లను తొలగించడం, సిమెంట్ రోడ్డు నిర్మించడంకానీ చేపట్టలేదని ఎస్‌సి, బిసి కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమ కాలనీకి రోడ్డు మార్గం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న సిసి రోడ్డు, దారికిరువైపులా అల్లుకుపోతున్న కంపచెట్లు

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రయోజనం : డిఎంహెచ్ఒ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

ప్రజాశక్తి - చాపాడు

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో ప్రయోజనమని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవసరమైతే ప్రత్యేక చికిత్సలు చేయించాలి

వెదురూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజలు శిబిరానికి వచ్చినప్పుడు వారికి వైద్యపరంగా ఏమేమి అవసరమో తెలుసుకొని వారిని ప్రత్యేక వైద్యులతో చికిత్స అందించాలన్నారు. సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడమాలజిస్ట్ ఖాజా మొహిద్దీన్, ఆరోగ్య విస్తరణ అధికారి కెఎస్‌వి ప్రసాద్, స్పెషలిస్ట్ డాక్టర్లు మధుసూదన్, షాజీద్ బాషా, డాక్టర్ కావ్య మాధురి, ఓబులేసు, కంటి వైద్యుడు కెజె రఘురామిరెడ్డి, సిహెచ్ఒ మహాదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, ఆశా నోడల్ అధికారి సుకన్య, హెల్త్ అసిస్టెంట్ రమేష్, యంఎల్‌హెచ్‌పి లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో మంగళవారం సర్పంచ్ పల్లా గంగయ్య, ఎంపిపి-1 పాలగిరి వీర రేణుక ఆధ్వర్యంలో ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీకాంత్ సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి విజయ భారతి, వైసిపి మండల యూత్ అధ్యక్షులు సిద్ధు, మాజీ ఉప సర్పంచ్ గోపాలకృష్ణ, వైసిపి నాయకులు వీర ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడంలో హిందీ భాషదే అగ్రస్థానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్వాతంత్ర్యోద్యమకాలంలో దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో తనదైన భూమికను పోషించిన భాష హిందీ. ఇంతటి గొప్పభాషను అంతర్జాతీయంగా ప్రోత్సహించడానికి భాష పట్ల అవగాహన పెంచేందుకు 2006వ సంవత్సరం నుండి ప్రతి ఏటా జనవరి10న ప్రపంచ హిందీ భాషాదినోత్సవం జరుపుకుంటున్నామని హిందీ లెక్చరర్ జ్యోతి తెలిపారు. బుధవారం అంతర్జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా ఆమె మంగళవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఇండో యూరోపియన్ పరివారానికి చెందిన హిందీ భాష నేడు ఆంగ్ల మాండరిన్ తర్వాత 60కోట్ల మందికిపైగా మాట్లాడే ప్రపంచ మూడవ అతిపెద్ద భాషగా ఘనతకెక్కిందన్నారు. హిందీ భాషాభివృద్ధికి 1957 జనవరి 10న 30 దేశాల ప్రతినిధులతో మహా రాష్ట్రలోని నాగ్‌పూర్‌లో తొలి అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మన దేశంలోనే కాకుండా పాకిస్తాన్ ఫిజీ దేశాల్లో కూడా హిందీని అధికార భాషగా వ్యవహ రిస్తున్నారన్నారు. హిందీ సాహిత్య రంగం అత్యంత సుసంపన్నమైందన్నారు. సమాజాన్ని మేల్కొలపడంలోనూ, దురాచారాలను ప్రశ్నించడంలోనూ ఎల్లవేళలా ముందుడే కవులు రచయితలూ హిందీ సాహిత్యానికి సొంతం అన్నారు. ఈ సందర్భంగా ఆధునిక హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేసి ఆధునిక హిందీ పితామహుడిగా ఘనతకెక్కిన భారతేందు హరిశ్చంద్రను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. బ్యాంకింగ్ ప్రకటనలు, అనువాద టెలివిజన్, చిత్రపరిశ్రమ వంటి పలు రంగాల్లో ఉపాధి కలించడంలో హిందీ భాష ముందు వరుసలో ఉందన్నారు. భారతదేశ ఔన్నత్యానికి ఒక ప్రతీకగా వెలుగొందుతున్న హిందీ భాషాభివృద్ధికి ప్రతి భారతీయుడు తన వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠకులకందరికీ అంతర్జాతీయ హిందీ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ 'దేశ్‌కీ షాన్ హై హిందీ-దేశ్‌కీ పెహెచాన్ హై హిందీ' అని హిందీ లెక్చరర్ జ్యోతి వివరించారు.



హిందీ అధ్యాపకులు జ్యోతి

'వైద్యుల సూచనలు తప్పక పాటించాలి'



పెరుగు నారాయణ యాదవ్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య పరీక్షలు నిమిత్తం వచ్చిన గర్భిణులకు, రోగులకు మంగళవారం అన్న ప్రసాద వితరణ చేశారు. దాదాపు 200 మందికి చాపాడు మండలం అల్లాడుపల్లె గ్రామానికి చెందిన ఇంద్రప్రస్థ డెవలపర్స్ వెంచర్ అధినేత పెరుగు నారాయణ యాదవ్ ఆర్థిక సహాయంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా దాత పెరుగు నారాయణ యాదవ్ మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం గొప్పదన్నారు. అనంతరం దాత పెరుగు నారాయణ యాదవ్‌ను సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ కరీముల్లా, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో గుత్తి వీరకిషోర్ యాదవ్, పాపన రాజశేఖర్‌రెడ్డి, వాగ్దాడం శివశంకర్, ఇమ్మడిశెట్టి సతీష్ బాబు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌సిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం

కొండాపురం : రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం కొండాపురం ప్రాథమిక వైద్యశాలలో పరీక్షలకు హాజరైన గర్భిణులు, సంఘసేవలకులైన వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు అన్నదానం చేశారు. ఈ విధమైన భోజనం వసతిని ప్రతినెలా ఏర్పాటు చేస్తామని ఆర్‌సిడిఎస్ రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీ ఆలమూరు జగన్మోహనరెడ్డి, కడప జిల్లా మీడియా విభాగం అధ్యక్షుడు వెల్లాల లింగేశ్వరరెడ్డి తెలిపారు. అనంతరం వైద్యులు సుజాత, సాంబశివారెడ్డి, సిబ్బంది నారాయణరెడ్డి, జ్యోషి, నాగలక్ష్మి ఆర్‌సిడిఎస్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ మీడియా విభాగం అధ్యక్షుడు భాను ప్రభంజన్‌రెడ్డి, సభ్యులు బాలనాగిరెడ్డి, పోలు వెంకటరామిరెడ్డి, హనుమంతరెడ్డి, ప్రభాకరరెడ్డి, వంగనూరు మల్లారెడ్డి, చదర్ల లక్మినాథరెడ్డి, బాల నరసింహారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతమైనందుకు ఆర్‌సిడిఎస్ జాతీయ కన్వీనర్ ఒంటెద్దు రామలింగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ప్రొద్దుటూరు : గర్భిణులు క్రమం తప్పక వైద్యుల సూచనలు పాటిస్తే పండంటి బిడ్డకు తల్లి అవుతారని ధ్రితి ఆసుపత్రికి చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ అనూషా వల్లంకొండు తెలిపారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం టిబి రోడ్డులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

చాపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా 62 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రాజేష కుమార్, శ్రీవాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యం కోసం వచ్చిన వారికి డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ మాధవీలత దంపతులు భోజనవసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సరస్వతి, బాబుల్ రెడ్డి, పర్యవేక్షకులు భాస్కర్, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే జగన్ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. జగన్ ప్రతిపక్షనేత హోదాలో పాదయాత్ర ప్రారంభించి అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక రాజన్న ఉచిత భోజనశాలలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, మహిళాధ్యక్షురాలు కోనేటి సునంద, సహకారం బ్యాంకు చైర్‌పర్సన్ ఝాన్సీ, కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

ఎంపీ, జడ్‌పిటిసిపై విమర్శలు తగవు

వేంపల్లె : వేంపల్లె గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డిపై టిడిపి మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని బలిజ సంఘం నాయకుడు కటిక నాగరాజు, వెంకట్రామిరెడ్డి, విద్య కమిటీ చైర్మన్ నాగేంద్ర తెలిపారు. మంగళవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇతరులపై ఆరోపణలు చేసేటప్పుడు నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వేంపల్లె గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నట్లు చెప్పారు. ఓర్వలేక టిడిపి అవినీతి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మభ్య పెట్టేలా ప్రత్యర్థులపై చౌకబారు ప్రకటనలు చేయడం దుర్మార్గమన్నారు. టిడిపి పాలనలో వేసిన రోడ్లు, పాఠశాల భవనాలు పూర్తిగా నిర్మాణాలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే దెబ్బతిన్నట్లు ఆరోపించారు. అప్పుడు టిడిపి నాయకులే విమర్శలు కూడా చేశారనే విషయాన్ని టిడిపి నాయకులు గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు. ఎన్ని కుయుక్తులకు పాల్పడినా వేంపల్లెలో టిడిపికి మెజార్టీ వచ్చే అవకాశం లేదన్నారు. ఇకనైనా చౌకబారు విమర్శలు చేయడం టిడిపి మాజీ ఎమ్మెల్సీ బిటెక్ మానుకోవాలని హితవు పలికారు.

బాలోత్సవంలో బాలుర పాఠశాల విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : కడపలో జరిగిన బాలోత్సవం పోటీల్లో వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ఆయా పాఠశాలల నుండి 4 వేల మంది పాల్గొన్న బాలోత్సవం పోటీల్లో బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు రకరకాల మట్టి బొమ్మలను తయారు చేశారన్నారు. చిత్ర లేఖనం, మట్టిబొమ్మలు తయారు చేసే అంశంపై ప్రతిభ చూపడంతో 20 మంది విద్యార్థులు బహుమతులు అందుకున్నట్లు చెప్పారు. జూనియర్స్ విభాగంలో జిల్లాస్థాయిలో ధనుంజయ్ అనే విద్యార్థికి ప్రథమ బహుమతి వచ్చినట్లు చెప్పారు. బాలోత్సవం పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపడం పట్ల హెచ్ఎం శివమునెమ్మ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్‌ను హెచ్ఎం అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబానికి మంగళవారం వైఎస్ఆర్ బీమా కింద లక్ష రూపాయలు ప్రభుత్వం నుంచి రావలసి ఉంది. ఆ మేరకు కర్మ కాండలకు అందులో నుంచి రూ.10వేలు ప్రభుత్వం తరఫున కౌన్సిలర్ ఆలమూరు విజయకుమార్ నాయుడు, వెల్ఫేర్ విజయభాస్కర్ అందించారు.



రూ.10 వేలు అందజేస్తున్న కౌన్సిలర్



పార్టీలో చేరినవారితో భూపేష్‌రెడ్డి

50 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు మంగళవారం టిడిపిలో చేరాయి. జమ్మలమడుగు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు లింగందిన్నె నాగిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, పోలిరెడ్డి, వెంకటరామిరెడ్డి, శివరామిరెడ్డి, కొండారెడ్డి, భగవాన్‌రెడ్డి, గంగిరెడ్డి, రామిరెడ్డి, షరీఫ్, షబ్బీర్, బాషా పలువురు చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, నాయకులు పెద్దబాబు, నాగేంద్ర, ఓబుల్‌రెడ్డి, రాజా, ఆంజనేయులు, ఓబులేసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి బాటపడుతుందని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి పేర్కొన్నారు. పట్టణం లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నుండి మంగళవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ టిడిపి మేనిఫెస్టోలోని పథకాలను వివరిం చారు. సమిష్టి కృషితో టిడిపి విజయానికి పాటుపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, మాబాషా, లింగాల మండలం అమర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజకీయ ప్రత్యర్థి మాత్రమే

- టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని తాము ఏనాడూ శత్రువుగా భావించలేదని, ఆయన తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, రాజకీయంలో ధర్మ యుద్ధమే చేస్తానంటూ ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫోన్, ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్ అయిందంటూ, ఫేస్‌బుక్ ద్వారా అసభ్యకరమైన ఫొటోలు ప్రచురించి తనను, తన రాజకీయ జీవితాన్ని ప్రత్యర్థులు టార్గెట్ చేస్తున్నారంటూ ఎమ్మెల్యే ఎస్‌పిని కలవడంపై స్పందించానని తెలిపారు. ఇలాంటి వాటిని తాము, తమ పార్టీ ప్రోత్సహించబోదని ప్రవీణ్ స్పష్టం చేశారు. గతంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌కు వచ్చిన బెదిరింపు ఫోన్ కాల్స్, ప్రొద్దుటూరు మహిళా ఎస్ఐపై దాడి జరిగినప్పుడు ఎమ్మెల్యే ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాచమల్లు దగ్గర ఉన్న క్రికెట్ బుకీలే ఆయన ఫోన్ హ్యాక్ చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తాను పోలీసుల సమస్యపై కూడా ప్రభుత్వాలతో పోరాడతానని పేర్కొన్నారు.

తులసిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని చిలేకాంపల్లె పెద్దూరుకు చెందిన రామలింగారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి మంగళవారం ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని తులసిరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, అమర్, ఉత్తన్న, వినయ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఖాదరపల్లిలో ఉరుసు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదరపల్లి గ్రామంలో బుధవారం నుంచి బాబా ఫకృద్దీన్ స్వాములవారి ఉరుసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. బుధవారం ఉరుసు, 11న జెండా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

'కాంగ్రెస్ రాక కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు'

ప్రజాశక్తి - వేంపల్లె

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. తులసిరెడ్డిని రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం సమన్వయ కర్తగా నియమించినందుకుగానూ మంగళవారం పులివెందుల కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. తులసిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. కాంగ్రెసు పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తిరుపాల్‌రెడ్డి, రమేష్, శివ, నాగరాజు, గంగన్న, ఓబులేసు, నరసింహారెడ్డి, ఉత్తన్న, అమర్నాథ్‌రెడ్డి, బాలం సుబ్బరాయుడు, బాషా పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రికెట్ విజేత ఎంపిడిఒ టీం

ప్రజాశక్తి - లింగాల

ఆడుదాం ఆంధ్ర ఆటలలో మంగళవారం జరిగిన క్రికెట్ పోటీల్లో లింగాల ఎంపిడిఒ టీం విజేతగా నిలిచింది. ముందుగా పోలీస్ వర్సెస్ ప్రజాప్రతినిధులు క్రికెట్ ఆడగా అందులో పోలీస్ విన్నర్‌గా నిలిచారు. అనంతరం ఎంపిడిఒ వర్సెస్ తహశీల్దార్ టీంలు ఆడగా.. ఇందులో ఎంపిడిఒ టీం విన్నర్ అయింది. ఫైనల్‌గా పోలీస్ వర్సెస్ ఎంపిడిఒ టీంలు తలపడగా.. ఇందులో ఎంపిడిఒ టీం క్రికెట్ విన్నర్‌గా నిలిచింది. మంగళవారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఈ క్రికెట్ పోటీలు సిఐ మద్దిలేటి ప్రారంభించారు. క్రికెట్ పోటీలను పులివెందుల ఆర్‌డిఒ పరిశీలించారు. విన్నర్ జట్టుకు ఎస్ఐ రవికుమార్ మెమెంటోలు ప్రదానం చేశారు.



కప్పు అందుకుంటున్న ఎంపిడిఒ టీం

గండి మాజీ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి క్షేత్రం పాలక మండలి పదవీ కాలం పూర్తయిన సందర్భంగా మంగళవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్, సభ్యులు ఈశ్వరరెడ్డి, రామాంజులరెడ్డి, మునెమ్మ, శోభ, రెడ్డయ్య, ఆలయ ప్రధాన అర్చకులు, ఎక్స్అఫిషియో మెంబర్ శ్రీ కేసరి స్వామిని ఘనంగా సన్మానించారు. వక్తలు వారి అనుభవాలను విశదీకరించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, ముఖ్య అర్చకులు రాజ గోపాలాచార్యులు పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో చైర్మన్, పాలక మండలి సభ్యుల సహకారాలను కొనియాడారు.



మాజీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఏసి, అర్చకులు